క్లుప్తంగా

ఘనంగా మహాలక్ష్మమ్మ ఉత్సవాలు



వేగేశ్వరపురంలో మరిడి మహాలక్ష్మి అమ్మవారి సిరిబొమ్మతో గరగ నృత్యం

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామ దేవత మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో ఏటా మే నెలలో వచ్చే పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి సిరిబొమ్మను గరగ నృత్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అమర వీర సైనికులకు నివాళులర్పిస్తూ ర్యాలీ



అమర వీరులకు నివాళులర్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న కానూరు గ్రామస్తులు

పెరవలి: భారత్ యుద్ధ తంత్రాలు, సైన్యం శక్తి సామర్థ్యాలు ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి తెలియజేసిన త్రివిధ దళాలకు దేశ ప్రజలంతా సంఘీభావం తెలపాలని రామకృష్ణ సేవా సమితి కార్యదర్శి ప్రసాద్ రాజు అన్నారు. పెరవలి మండలం కానూరులో భారత్ – పాకిస్తాన్ యుద్ధంలో అమరులైన సైనికులకు రామకృష్ణ సేవా సమితి, వెంకయ్య స్వామి సమాజం, ఆంజనేయస్వామి సంఘాల పెద్దలతో కలసి నివాళులర్పించారు. అనంతరం సైనికులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. సైనికులకు ఆత్మస్థైర్యం కోసం తామంతా వారికి అండగా ఉంటామన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల ప్రాణత్యాగాలకు దేశం గర్వపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడికి సత్కారం

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ పెద్దేవం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన బట్టు సుబ్బారావును ఆదివారం పలువురు నాయకులు శాలువాతో సత్కరించి పూలమాలలు వేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, కొవ్వూరు మండల అధ్యక్షుడు వెంపాటి సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ పిట్టా శ్రీను, నాయకులు గండి రాంబాబు పాల్గొన్నారు.

సుబ్బారావు కుటుంబ సభ్యులకు వనిత పరామర్శ

నల్లజర్ల: ప్రకాశరావుపాలెం మాజీ ఎంపీటీసీ దూలపల్లి రామచంద్రరావు తండ్రి సుబ్బారావు దశదిన కార్యక్రమంలో మాజీమంత్రి తానేటి వనిత పాల్గొని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రమణ్యం, మాజీ జెడ్పీటీసీ బంక అప్పారావు, వామిశెట్టి పరమేశ్వరావు, మేణ్ని యువరాజు, నాగూయాదవ్, శెనగన సతీష్, కొనకళ్ళ సీతామహాలక్ష్మి, శ్రీకాకుళపు విక్రమాదిత్య, కరుటూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పవర్ టిల్లర్ల అందజేత



పసివేదలలో పవర్ టిల్లర్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి తదితరులు

తాళ్లపూడి(కొవ్వూరు): రైతులు ఆధునిక వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పసివేదలలో ఆదివారం వ్యవసాయ శాఖ ద్వారా మంజూరైన రెండు పవర్ టిల్లర్లను లబ్ధిదారులు వేగి వెంకటరత్నజీ, మీసాల శ్రీనుకు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు చేతుల మీదుగా అందజేసారు. అనంతరం పసివేదల సెంటర్ వద్ద గ్రామస్తులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, బీసీ కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.14 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుంపల్లి సింహాచలం, ఏడీఏ చంద్రశేఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. నీతి కథలు చెప్పడం, యోగా, చదరంగం, హ్యాండ్ క్రాఫ్ట్, లలిత సంగీతం, భగవద్గీత తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు మజ్జిగ, బిస్కట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పింఛన్ల కోసం ఎదురుచూపులు

- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, వితంతువులు
- పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే భార్యకు బదిలీ
- వితంతు పింఛన్ల మంజూరుకు మెలిక
- నిరుపేద వితంతువులకు కొత్త పింఛన్ మంజూరుకు మొండిచేయి
- నిడదవోలు నియోజకవర్గంలో 35,817 మంది పింఛన్‌దారులు



సమిశ్రగూడెంలో ఇంటికి వెళ్లి లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్లు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు (ఫైల్)

నిడదవోలు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 11 నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క సంక్షేమ పథకం కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్న దాఖలాల్లేవు. చివరకు ఏ దిక్కూ లేని వృద్ధులు, వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేసేందుకు వెనుకంజ వేస్తోంది. దీంతో నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లోని ఆయా గ్రామాల్లో అర్హులంతా సచివాలయాల చుట్టూ కళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇటీవల స్పౌజ్ కేటగిరిలో పింఛన్ల మంజూరు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే మాత్రమే భార్యకు బదిలీ చేస్తున్నారు. పింఛన్ రాని వ్యక్తి చనిపోతే ఆయన భార్యకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నారు. వివిధ సామాజిక పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి నిరాశే మిగులుతోంది. నిడదవోలు నియోజకవర్గంలో నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల పరిధిలో ప్రతి నెలా 35,817 మందికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా..

వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గ్రామాల్లోని సచివాలయాలకు, పీజీఎస్ఎస్ కార్యక్రమాలకు పదుల సంఖ్యలో పింఛన్ల కోసం వెళుతున్నారు. నూతన పెన్షన్ల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించకపోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. దీంతో పింఛన్లు ఎప్పుడు ఇస్తారో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెన్షన్లు మంజూరు కాకపోవడంతో సమాధానం చెప్పలేక ఆయా గ్రామాల్లోని నాయకులు బయట తిరగలేకపోతున్నారు.

గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి పథకం పక్కాగా అమలయ్యేది. పింఛన్లు, రేషన్‌కార్డులు కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే అందించేవారు. పింఛన్ల మంజూరులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుసరించిన విధానమే సరైందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. పింఛన్ బదలాయింపు వంటివి లేకుండా సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించారు. భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్లు మరుసటి నెలలోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకునేవారు. అదే విధంగా ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరుకు అవకాశం కల్పించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకపోవడంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారు.

పింఛన్ దరఖాస్తుకు అవకాశం ఇవ్వాలి

నా భర్త నాగేశ్వరరావు 2024 ఏప్రిల్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. నేను కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నాకు ముగ్గురు పిల్లలున్నారు. భర్త చనిపోయి జీవనోపాధి కోల్పోయిన నాకు వితంతు పింఛన్ రావడం లేదు. ప్రభుత్వం స్పందించి పింఛన్ దరఖాస్తుకు అవకాశం కల్పించి, మంజూరు చేయాలి.

–సిర్రా నాని, సమిశ్రగూడెం

కొత్తగా దరఖాస్తుకు అవకాశం లేదు

సామాజిక పింఛన్‌దారు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరిలో పింఛన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతానికి అవకాశం లేదు. వెబ్‌సైట్ తెరుచుకుంటే అర్హులైన వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

–డి.లక్ష్మినారాయణ, ఎంపీడీఓ, నిడదవోలు

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



మునిపల్లిలో పోలేరమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం మునిపల్లి గ్రామ దేవత పోలేరమ్మ జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. పోలేరమ్మను మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు దర్శించుకున్నారు. భక్తులంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. జాతరకు వచ్చిన ఆడపడుచులు, బంధువులతో గ్రామమంతా కళకళలాడింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, సర్పంచ్ వెలగన నరేష్, వివిధ గ్రామాల నాయకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు. సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మెగా వైద్యశిబిరం

నిడదవోలు రూరల్: డి.ముప్పవరం ఎంపీయూపీ స్కూల్లో ఏలూరు ఆశ్రం హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు 236 మంది రోగులను పరీక్షించి రోటరీ క్లబ్ సభ్యులు ఎం.అమ్మిరాజు, మీనాక్షి దంపతుల ఆర్థిక సహాయంతో మందులు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరం సాయిరామ్ దంత వైద్యశాల సిబ్బంది వైద్యసేవలు అందించారు.

మాజీ మంత్రి విడదల రజనీపై దౌర్జన్యం అమానుషం

మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: దేశంలో యుద్ధ వాతావరణం నెలకొని ఉంటే చంద్రబాబు మాత్రం పాలనను విస్మరించి రాష్ట్రంలో అరాచకాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు విమర్శించారు. ఆదివారం ఆయన చాగల్లులో మాట్లాడుతూ పల్నాడు జిల్లా నాందెడ్ల మండలం మానుకొండ వారి పాలెంలో ఓ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజని విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆమె పీఏను అక్రమంగా అరెస్ట్ చేసి తీసుకెళ్తుంటే ప్రశ్నించినందుకు మహిళ అని కూడా చూడకుండా రజనిపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే రౌడీల్లా వ్యవహరించడం చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఏ స్థాయిలో దిగజారిపోయాయో అర్థమవుతోందని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల మీద కక్ష సాధింపులకు పాల్పడేందుకే టీడీపీ ఎమ్మెల్యే సీఐ సుబ్బారాయుడుని నియమించుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి విడదల రజని పట్ల చిలుకలూరిపేట రూరల్ సీఐ సుబ్బారాయుడు సభ్యతా, సంస్కారాలను మరిచిపోయి కీచకుడిలా వ్యవహరించారని విమర్శించారు.

మహిళలకు రక్షణ కరువు

గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరులోనూ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ అయిన కల్పన అనే దళిత మహిళను వేకువజామున 3 గంటలకు 20 మంది పోలీసులు దౌర్జన్యంగా వెళ్లి అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారని తెలిపారు. ఉదయం 6.30 గంటలకు అరెస్ట్ చేసినట్టు పోలీసులు కోర్టులో చెప్పారని తెలిపారు. నిర్బంధాలు, అణచివేతలతో వైఎస్సార్ సీపీని అడ్డుకోవాలని చూస్తే బెదిరేది లేదని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ తప్పులను సోషల్ మీడియాలో ప్రశ్నించిన వారికి రెడ్ బుక్ రాజ్యాంగంలో రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు.చంద్రబాబు తీవ్రంగా అధికార దుర్వినియోగం చేస్తున్నారని, చట్టాన్ని, న్యాయ ప్రక్రియను, కోర్టులను అపహాస్యం చేశారని ఆరోపించారు. చంద్రబాబు దుర్మార్గాలను ప్రజలు క్షమించరని వారికి తగిన బుద్ధి చెప్పే రోజులు ముందున్నాయని తలారి వెంకట్రావు అన్నారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణ మహోత్సవం



విశేష అలంకరణలో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు



అన్నవరప్పాడు ఆలయ ప్రాంగణంలో కూచిపూడి నృత్య ప్రదర్శన



వేణుగోపాలస్వామి కల్యాణ వేడుక

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు నాల్గవ రోజు వైభవంగా కొనసాగుతున్నాయి. వైశాఖమాసం ఆదివారం వందలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. ఆలయానికి వచ్చిన వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తులందరికీ ఉదయం, సాయంత్రం ఉచిత అన్నసమారాధన నిర్వహించినట్టు ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.స్వామి,అమ్మవార్లకు మహిళలు ఘనంగా సామూహిక తులసీ బృందార్చన పూజలు నిర్వహించారు. గ్రామంలో దేవదేవుడు ఊరేగింపులో భాగంగా కోలాట బృందాల ప్రదర్శన ఆకట్టుకుంది.

అలరిస్తున్న సాంస్కృతిక కళా బృందాలు

దేవాలయ ప్రాంగణంలో ప్రతి రోజు నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరిస్తున్నాయి. ఆదివారం జానపదం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

వైభవంగా స్వామి వారి కల్యాణం

అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ సాగిన ఈ కల్యాణోత్సవాన్ని చూసిన భక్తులు పరవశించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

నల్లజర్ల: స్థానిక రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. వేదపండితులు ఖండవల్లి వీఎస్ఎస్ చిరంజీవి బృందం ఆగమశాస్త్రం ప్రకారం శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఉదయం నిత్యహోమం, బలహరణ, సాయంత్రం కుంకుమ పూజలు, నీరాజన మంత్రపుష్పం, అర్చన, అభిషేకాలు, తిరుమంజన సేవలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు,వేద మంత్రోచ్ఛరణల మధ్య సాగిన స్వామివారి కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ మద్దిపాటి చంద్రశేఖర్, ఈఓ నాగరాజు, ఆలయ అర్చకులు గంజాం భాస్కర రామకృష్ణ హాజరయ్యారు. కాగా 6వ శతాబ్దంలో వేంగి చాళుక్యులు ఈ ఆలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ నిర్వహణ సాగుతోంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కాకరపర్రులో కలసిన పూర్వ విద్యార్థులు



అనంతపల్లి జెడ్పీ హైస్కూల్లో కలసిన పూర్వ విద్యార్థులు

పెరవలి: బాల్య స్నేహితులంతా 30 ఏళ్ల అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో కలసి సందడి చేశారు. పెరవలి మండలం కాకరపర్రు ఉన్నత పాఠశాలలో 1990–1995 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలసి ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని ఆనాటి మధురస్మృతులను నెమరువేసుకున్నారు. 30 ఏళ్ల తరువాత కలసి చదువుకున్న బాల్య స్నేహితులను కలుసుకోవటం ఎంతో ఆనందంగా ఉందని వారంతా సంతోషం వ్యక్తం చేశారు. స్నేహితులంతా ఆనాటి జ్ఞాపకాలను, తీపిగుర్తులను నెమరు వేసుకుంటూ పరవశించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించారు.

23 ఏళ్లకు కలసిన బాల్య స్నేహితులు

నల్లజర్ల: అనంతపల్లి జెడ్పీ హైస్కూలులో 2002–03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. దాదాపు 23 ఏళ్ల అనంతరం కలుసుకున్న వీరంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ప్రస్తుతం ఏయే రంగాల్లో స్థిరపడ్డారో.. వారి చిన్ననాటి జ్ఞాపకాలు, తమ విద్యాభ్యాసం ఎలా సాగిందనే విషయాలను పరస్పరం పంచుకుని ముచ్చటించుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 60 మంది పూర్వ విద్యార్థులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తమకు చదువులు చెప్పిన గురువులు శివపార్వతి, పద్మావతి, విమల, వెంకటేశ్వరావు, బాదుషా, కృష్ణమూర్తి, చింతారావు ప్రస్తుత స్కూలు హెచ్ఎం హేమంత్‌కుమార్‌లను శాలువాలు, పూలమాలలు, మెమెంటోలతో సత్కరించి తమ గురుభక్తి చాటుకున్నారు. తామంతా ఒక్కటయ్యేందుకు కృషి చేసిన పూర్వ విద్యార్థులు భీష్మ, తాళ్లూరి సాయిమాధురి, గాయత్రి, రత్నకుమారి, సింధూరం, పి.సతీష్‌లను అభినందించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా పాఠశాలకు విలువైన వస్తువును అందజేస్తామని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వెల్లడించారు.

పలు కార్యక్రమాలకు హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే



గొల్లగూడెంలో కోటి స్వరూప్‌ను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకలు, పరామర్శ కార్యక్రమాలకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్మన్, గోపాలపురం నియోజకవర్గం సమన్వయకర్త తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు హాజరయ్యారు. దేవరపల్లి మండలం గొల్లగూడెంలో జరిగిన గ్రామ సచివాలయ ఉద్యోగి పులగం కోటి స్వరూప్ వివాహ వేడుకలకు హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, నరహరిశెట్టి రాజేంద్రబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, మండల మహిళా కమిటీ అధ్యక్షురాలు కడలి హైమావతి, ఎంపీటీసీ సభ్యులు సొంటి కాశీవిశ్వనాథం, సత్తి జగదీశ్వరరెడ్డి, పార్టీ నాయకులు గడా రాంబాబు, పెనుపోతుల సుబ్బారావు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, సుంకర గంగరాజు, సుంకర రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

తాళ్లపూడి: మాతృ దినోత్సవం సందర్భంగా పెద్దేవంలో ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు వృద్ధులకు దుస్తులు, చీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బట్టు సుబ్బారావు, మండల కాపు సంఘం అధ్యక్షుడు నామ ప్రకాశం, నాయకులు ఎండపల్లి వీర వెంకటసత్యనారాయణ, గెడ్డం వెంకటేష్, బట్టు బాలాజీ పాల్గొన్నారు.

నిడదవోలులో....

నిడదవోలు : పట్టణంలో నంగాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకులు రంగా వెంకటేశ్వరరావు తన మాతృమూర్తి రంగా సత్యవతి పేరున ఆదివారం 60 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నీలం రామారావు, తోరం జయశ్రీనివాస్, నిడమర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత రథయాత్ర



నిడదవోలులో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి రథయాత్ర

నిడదవోలు : పట్టణంలో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డున చినకాశిరేవులో వేంచేసియున్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి రథయాత్ర వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ రథయాత్ర బుట్టబొమ్మలు, కోలాట నృత్యాలు, మహిళల నృత్యాలు, బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాలతో కోలాహలంగా సాగింది. వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్యులు, ఆర్యవైశ్య మహిళా సంఘాలు, వాసవి వనితా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రథయాత్ర కమిటీ సభ్యులు గమిని వీరన్నబాబు, ఉప్పల సతీష్, కేదారిశెట్టి సత్యనారాయణ, బచ్చు వీరవెంకట లక్ష్మణరావు, చెక్క రవికుమార్, గ్రంధి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అమృత ఫలం.. విషతుల్యం

- మామిడి రంగు చూసి నోరూరిందా.. ఆరోగ్యం హరీ!
- మాగబెట్టేందుకు కృత్రిమ పద్ధతులతో అనర్థం
- కార్బైడు వినియోగంపై నిషేధం అమలు
- సంప్రదాయ విధానమే మేలంటున్న వైద్యులు



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధమైన మామిడి పండ్లు

నల్లజర్ల: ప్రతి వేసవిలో అందుబాటులోకి వచ్చే ఫలరాజం మామిడి పండును చూస్తే నోరూరని వారుండరు. వేసవి సీజన్ వచ్చిందంటే నల్లజర్ల జంక్షన్‌లోనే కాదు, రహదారి పక్క మార్జిన్లలో ప్రజలు అమృత తుల్యంగా భావించే మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. పరిసర ప్రాంతాల్లో మామిడి పంట తక్కువగా ఉండటంతో ఇక్కడ విక్రయిస్తున్న మామిడి పండ్లకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు అనుగుణంగా విక్రయించడానికి వ్యాపారులు తక్కువ సమయంలోనే మామిడిని పక్వానికి తేవడానికి ఆరోగ్యానికి హానికరమైన కార్బైడును వినియోగిస్తున్నారు. గతంలో ఇటువంటి కృత్రిమ పద్ధతుల ద్వారా కాకుండా ఓ గదిలో ఎండు గడ్డి వేసి పండ్లను మాగబెట్టేవారు. ఈ పద్ధతిన మామిడి పక్వానికి రావడానికి కనీసం వారం రోజులు పట్టేది. ప్రకృతి సిద్ధంగా పండిన మామిడి కాయ మంచి రుచి, సువాసన కలిగి ఉంటుంది. వాటిని తింటే ఆరోగ్యానికి ఎటువంటి హానీ ఉండేది కాదు. కానీ ఇటీవల తక్కువ సమయంలో విక్రయాలకు పండ్లను సిద్ధం చేయడానికి కార్బైడు వినియోగం ఎక్కువైంది. కార్బైడు వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించినా చాటుమాటుగా ఇంకా అక్కడక్కడా వినియోగిస్తున్నారు. దీనివల్ల కాయరంగు పసుపు పచ్చగా మారి నోరూరిస్తుంది. తీరా ఇంటికి వెళ్లి కోసి చూస్తే లోపలంతా పచ్చి, రుచి ఉండదు. అంతేకాకుండా కార్బైడు వినియోగించిన మామిడి పండ్లను తినడం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్ వంటి జబ్బులు వచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనిపై నల్లజర్ల ఉద్యాన శాఖాధికారి బబితను వివరణ కోరగా కార్బైడ్ వినియోగం ప్రాణాంతకం అన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై ఆహార కల్తీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. .

కాయలు కోసే పద్ధతి

మామిడి పిందె ఏర్పడ్డ నాటి నుంచి పూర్తిగా పక్వానికి రావడానికి 120 రోజుల నుంచి 150 రోజుల వరకు పడుతుంది.కాయ లోపలి భాగం పసుపు రంగులో మారిన తర్వాత కోయాలి. కాయలను 10 సె.మీ తొడిమి ఉండేలా వల వంటి గెడతో కోయాలి. సొన పూర్తిగా తొలగిపోయే వరకు కాయలు కిందనే ఉంచాలి. ముదిరిన కాయలను ఉదయం 10 గంటల లోపు సాయంత్రం 5 గంటల తర్వాత కోయాలి. నీటితో శుభ్రం చేస్తే మంచిది. ఆనీటిలో టీపాల్ లేదా సాండోవిట్ 1ఎంఎల్ కలపాలి. కాయలను ఆనీటిలో ముంచి అనంతరం ఆరబెట్టాలి.

మాగబెట్టే విధానం

ఒక గదిలో బోద గడ్డి లేదా వరి గడ్డిపరిచి దానిపై మామిడి పండ్లను ఉంచి వాటిపై గడ్డి కప్పాలి. ఇలా చేస్తే రెండు, మూడు రోజుల్లోనే కాయలు మాగుతాయి. మంచి నాణ్యత కలిగి ఉంటాయి.దీంతో పాటు మామిడికి రంగు, రుచి కోసం అవసరం అయితే ఇథైల్‌ను వాడవచ్చు. ఇది రసాయనం కాకపోవడంతో ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉండవు. మామిడి పండ్లను చెక్క పెట్టెల్లో కాకుండా సీఎఫ్‌బీ పెట్టెల్లో 5నుంచి 10 కిలోల పండ్లు రవాణా చేయవచ్చు.

శీతలీకరణ నిల్వ



మామిడిని కోల్డ్‌స్టోరేజీల్లో 10 నుంచి 12 సెల్సియస్ ఉష్ణోగ్రతలో 80 నుంచి 90 తేమశాతం తేమలో దాదాపు 30 రోజుల వరకు నిల్వ చేసుకోవచ్చు.

– యం.బబిత, ఉద్యానశాఖాధికారి, నల్లజర్ల